క్లుప్తంగా

కాకాణిని కలిసిన రామిరెడ్డి



కావలి: జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం దగదర్తి మండల వైస్‌ఎంపీపీ ఎన్నిక సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహంపై కాకాణితో చర్చించారు. రామిరెడ్డి వెంట కావలి వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

నేత్రపర్వంగా కల్యాణోత్సవం



ఆత్మకూరు: పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై విశేషంగా అలంకరించిన స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి అర్చకులు రామయ్యస్వామి, శ్రీనివాసశర్మ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని జరిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు అస్వస్థత



108లో ఆస్పత్రికి వెళ్తున్న డ్రైవర్

సంగం: నెల్లూరు నుంచి లింగసముద్రానికి బయలుదేరిన ఆర్టీసీ బస్సు సంగం వద్దకు రాగానే డ్రైవర్ అహ్మద్‌బాషా బుధవారం అస్వస్థతకు గురయ్యాడు. గుండెల్లో భారంగా ఉందని బస్సును రోడ్డు పక్కన నిలిపివేశాడు. దీంతో కండక్టర్ 108 వాహనంలో డ్రైవర్‌ను సంగం పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. కాగా ప్రయాణికులను సురక్షితంగా మరో బస్సులో గమ్యస్థానాలకు పంపించారు. అస్వస్థతకు గురైనా సురక్షితంగా బస్సును నిలిపి ప్రాణాలను కాపాడిన డ్రైవర్‌ను ప్రయాణికులు అభినందించారు. ఆయన క్షేమంగా ఉండాలని కోరుకున్నారు.

గ్రామసింహాల స్వైరవిహారం



కుక్కల దాడిలో మృతిచెందిన మేక పిల్లలు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం ఊటుకూరులో గ్రామసింహాలు స్వైరవిహారం చేస్తున్నాయి. మేకల మందలపై దాడి చేస్తుండడంతో జీవాల పెంపకందారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మంగళవారం సాయంత్రం ఎస్సీ కాలనీలో గడ్డం చెన్నయ్యకు చెందిన దొడ్డిలోని జీవాలపై కుక్కలు దాడిచేశాయి. ఈ ఘటనలో రెండు మేకలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో రెండు తీవ్రంగా గాయపడ్డాయి. మరో రెండు మేకలు దొడ్డి నుంచి బయటకు వచ్చి కనిపించకుండా పోయాయి. ఇలా తరచూ వీధి కుక్కలు జీవాలపై దాడి చేస్తూ తీవ్రనష్టాన్ని కలిగిస్తున్నాయని జీవాల పెంపకందారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కలను నియంత్రించాల్సిన పంచాయతీ పాలకులు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకులు స్పందించి వీధి కుక్కలను నియంత్రించాలని వారు కోరుతున్నారు.

ఉగాది క్యాలెండర్ల పంపిణీ



దుత్తలూరు: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి దుత్తలూరు శాఖ ఆధ్వర్యంలో ఉగాది క్యాలెండర్లను బుధవారం పంపిణీ చేశారు. తహసీల్దార్ యనమల నాగరాజు, ఎంపీడీఓ ఎస్ మల్లికార్జున, వెలుగు ప్రత్యేక అధికారి నరసింహరావు, తదితరులకు క్యాలెండర్లు అందజేశారు. సేవా సమితి దుత్తలూరు అధ్యక్షుడు జీ ప్రసాద్, సభ్యులు సుధాకర్, పెంచలరత్నం, వెంకటేశ్వర్లు, మాలకొండారెడ్డి, వెంకటసుబ్బమ్మ, రమ్యశ్రీ, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఈత..కావొద్దు గుండెకోత

- సరదా కోసం వెళ్తే ప్రాణాలు హరీ
- ప్రతి వేసవి సీజన్‌లోనూ ఘటనలు
- తల్లిదండ్రుల నిఘా తప్పనిసరి



చెరువు వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన పోలీసులు (ఫైల్)

సంగం: వేసవి సెలవులు వస్తున్నాయంటే పిల్లల ఆనందానికి అవధులు ఉండవు. ఏడాది పొడువునా చదువుల్లో మునిగితేలిన వారు ఆటపాటలతో గడిపేందుకు మక్కువ చూపుతారు. వేసవిలో నీటి వనరుల్లోకి వెళ్లి ఈత కొట్టడం అంటే పిల్లలకు చెప్పలేనంత సరదా. అయితే ఆ సరదా మాటున ప్రమాదం కూడా పొంచి ఉంది. నదులు, చెరువులు, కాలువలు పిల్లలను కబళించే ప్రమాదం ఉంది. అందువల్ల తల్లిదండ్రులు ప్రమాదాలు జరిగాక బాధపడే కన్నా పిల్లలపై ఓ కన్నేసి ఉంచడం మంచిది. ఓవైపు ఎండలు మండుతున్నాయి. ఇంటర్మీడియట్ పరీక్షలు ముగిశాయి. పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నాయి. మిగిలిన విద్యార్థులకు ఒంటి పూట బడులు ప్రారంభించారు. దీంతో మధ్యాహ్న సమయంలో విద్యార్థులు గ్రామాల సమీపంలోని నీటి వనరుల వద్దకు సరదాగా ఈతకు వెళ్లే ఆస్కారం ఉంది. అయితే నీరు లోతు తక్కువగానే ఉందని భావించినప్పటికీ ఇసుకలో కూరుకుపోవడం, సుడిగుండాల్లో చిక్కుకుపోవడం, సరిగా ఈత రాకపోవడం, తదితర కారణాలతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయి పిల్లలు మృత్యువాత పడే అవకాశం ఉంది.

పెన్నాతీర గ్రామాల్లో ప్రమాదాలకు అవకాశం

ఆత్మకూరు నియోజకవర్గంలోని అనంతసాగరం మండలం నుంచి సంగం మండలం వరకు పెన్నానది సుమారు 70 కిలోమీటర్ల మేర ప్రవహిస్తోంది. దీనికి తోడు ఆయా మండలాల పరిధిలోని ప్రధాన చెరువులు, వాగులు, వంకలు, కాలువలు ఉన్నాయి. వేసవి సెలవుల్లో చిన్నారులు సరదాగా ఈత కొట్టేందుకు జలవనరుల వద్దకు వెళ్తుంటారు. ప్రధానంగా పెన్నానదిలోకి సమీప గ్రామాలకు చెందిన పిల్లలు ఈతకు వెళ్లి నీటి సుడిగుండాల్లో చిక్కుకుని మృత్యువులు పాలైన ఘటనలు అనేకం ఉన్నాయి. గతంలో వేసవిలో ప్రమాదాలు జరిగిన సమయంలో పోలీసు అధికారులు పెన్నానదితో పాటు చెరువులు, వాగులు, వంకల వద్ద ఈత నిషేధమంటూ హెచ్చరికబోర్డులు సైతం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వేసవి సెలవులు సమీపిస్తున్న దృష్ట్యా మళ్లీ పోలీసు అధికారులు పెన్నానదిలో, చెరువుల వద్ద ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు తల్లిదండ్రులను అప్రమత్తం చేయడం ద్వారా ప్రమాదాలను కట్టడి చేయవచ్చు. ఆ దిశగా పోలీసు అధికారులు చొరవ చూపి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

గతంలో జరిగిన విషాదాలు

- 2022లో సెప్టెంబరులో ఆత్మకూరు మండలం అప్పారావుపాళెం వద్ద పెన్నానది బ్రిడ్జి సమీపంలో సరదాగా ఈతకు వెళ్లి లోకేష్ అనే విద్యార్థి మృతి చెందాడు.
- 2023లో సెప్టెంబర్‌లో సంగం వద్ద పెన్నానదిలోకి ఈతకు వెళ్లిన మనోజ్‌కుమార్ ప్రమాదవశాత్తు మునిగిపోయి మృతి చెందాడు.
- 2024 ఏప్రిల్‌లో అనంతసాగరం మండలం ఉప్పలపాడు సమీపంలో పెన్నానదిలో వంశీకృష్ణ, నరసింహులు అనే సోదరులు ప్రమాదవశాత్తు గల్లంతై మృతి చెందారు.
- 2024 ఫిబ్రవరిలో సంగం మండలం కోలగట్లలో నాగార్పమ్మ ఆలయ వద్దకు వచ్చిన ఆత్మకూరుకు చెందిన పదో తరగతి విద్యార్థి యశ్వంత్ సమీపంలోని పెన్నానదిలోకి వెళ్లి మునిగిపోయి మృతి చెందాడు.
- 2023లో సంగం మండలం గాంధీ జనసంఘం వద్ద కనిగిరి రిజర్వాయిర్ ప్రధాన కాలువలో మునిగిపోయి దిగుడు శ్రీకాంత్ అనే యువకుడు మృతి చెందాడు.



యశ్వంత్ మృతదేహాన్ని మోసుకొస్తున్న బంధువులు(ఫైల్)

తల్లిదండ్రులు నిఘా ఉంచాలి



“వేసవిలో పిల్లలపై తల్లిదండ్రులపై నిఘా ఉంచాలి. నీటి వనరుల వద్దకు ఈతకు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. నీటి వనరులు కలిగిన గ్రామాల వద్ద గ్రామస్తులను అప్రమత్తం చేసేలా చర్యలు తీసుకుంటాం. ప్రమాదాలు జరిగే చోట హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రజల సహకారంతోనే ప్రమాదాల నివారణ సాధ్యం.

–వేమారెడ్డి, సీఐ, సంగం

సందడిగా యూత్ హంగామా

బిట్రగుంట: బోగోలు మండలం కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ‘ఆర్ఎస్సార్ కార్నివాల్–2025’ పేరుతో బుధవారం నిర్వహించిన యూత్‌హంగామా సందడిగా సాగింది. విద్యార్థుల్లో సృజనాత్మకతను, బృందంతో కలిసి పనిచేసే నైపుణ్యాలను పెంపొందించేలా రూపొందించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. జ్యూక్‌బాక్స్, ఫుడ్‌కోర్ట్, కూల్‌డ్రింక్ స్టార్, రింగ్ రాజా, కాయిన్ ఇన్ బకెట్, ఆర్ఎస్సార్ షాపింగ్‌మాల్, తదితర స్టాళ్లను విద్యార్థులు సృజనాత్మకంగా తీర్చిదిద్దారు. వ్యాపార మెళకువలు, వినియోగదారులకు మెరుగైన కొనుగోలు అనుభవాన్ని అందించడం, తదితర అంశాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అదే విధంగా జ్యూక్‌బాక్స్ ద్వారా ఏర్పాటు చేసిన పాటలు కళాశాల ప్రాంగణాన్ని హోరెత్తించాయి. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీవీఎస్ రెడ్డి, ఏఓ ఆర్వీ రమణారెడ్డి, కార్నివాల్ సమన్వయకర్త సునీల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్లతో నిఘా



డ్రోన్‌ను ప్రారంభిస్తున్న సీఐ, ఎస్సైలు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని ప్రధాన కూడళ్లు, అనుమానిత ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘాను ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఐ జీ గంగాధర్ తెలిపారు. ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో డ్రోన్లతో నిఘాను బుధవారం ఆయన ప్రారంభించారు. ఎస్సైలు ఎస్‌కే జిలానీ, సాయి ప్రసాద్, శ్రీనివాసులురెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక



దుత్తలూరు: మండల బీజేపీ కమిటీని బుధవారం ఎన్నుకున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల వెంగళరెడ్డి తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శులుగా అందె రామయ్య, తిప్పిరిబోయిన వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా పెసల కృష్ణ, చుండి సురేఖ, చంద్రశేఖర్‌రావు, సుధీర్‌కుమార్‌రెడ్డి, ప్రసన్న, చెన్నకృష్ణయ్యతో పాటు మరో ఆరుగురు కార్యదర్శులను ఎన్నుకున్నట్లు ఆయన వివరించారు.

అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ పావని

ఆత్మకూరు: ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని అన్నారు. ఆత్మకూరులోని ఆర్డీఓ కార్యాలయంలో ఆత్మకూరు డివిజన్ స్థాయి అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని డీఎస్పీ కే వేణుగోపాల్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ పావని మాట్లాడుతూ పౌరహక్కుల పరిరక్షణ చట్టం మేరకు దళితులు ఎక్కడా ఎలాంటి అన్యాయానికి గురికాకుండా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పనిచేయాలని కోరారు. అధికారుల సమిష్టి కృషితోనే వారికి సమన్యాయం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దళితులు అన్యాయానికి గురవుతుంటారని, అలాంటి జరగకుండా ఉండాలంటే ప్రతి నెలా క్రమం తప్పకుండా పౌరహక్కుల దినాన్ని నిర్వహించాలని సూచించారు. అందులో అన్ని శాఖల అధికారులు తప్పకుండా పాల్గొనేలా తహసీల్దార్లు చూడాలని కోరారు. త్వరలో అన్ని మండలాల్లో ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేకంగా ఆధార్ క్యాంపులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. కొన్ని మండలాల్లో ఎస్సీ, ఎస్టీ వసతిగృహాలకు ప్రహరీలు లేవని, మండలాధికారులు దాతల సహకారంతో నిర్మించేందుకు కృషి చేయాలని కోరారు. ఆత్మకూరు, సంగం, ఉదయగిరి, రాపూరు సీఐలు ఎం గంగాధర్, వేమారెడ్డి, వెంగళరావు, సత్యనారాయణ, తహసీల్దార్లు సుధీర్, సుభాషిణి, అనిల్, శ్యామ్ సుందర్‌రాజు, మురళి, ఎంపీడీఓలు శ్రీనివాసరావు, ప్రసన్నకుమారి, విజయలలిత, తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ కే వేణుగోపాల్

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలోని విద్యార్థులకు శక్తి యాప్‌పై డీఎస్పీ వేణుగోపాల్ బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం శక్తి యాప్‌ను తీసుకొచ్చిందని తెలిపారు. మహిళలు తమ సెల్‌ఫోన్లలో యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటే అత్యవసర పరిస్థితుల్లో సెల్‌ఫోన్ ద్వారా సమాచారం అందిస్తే నిమిషాల వ్యవధిలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రక్షణ కల్పిస్తారని వివరించారు. అనంతరం విద్యార్థినులతో సెల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేయించారు. ఆత్మకూరు, రాపూరు సీఐలు జీ గంగాధర్, సత్యనారాయణ, ఆత్మకూరు, సోమశిల ఎస్సైలు ఎస్‌కే జిలానీ, అనుషా, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు అదనపు సాయం



రికార్డులను తనిఖీ చేస్తున్న ఈఈ మోహన్‌రావు

సంగం: ప్రభుత్వ గృహ నిర్మాణాలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు సాయాన్ని అందజేస్తోందని హౌసింగ్ ఈఈ మోహన్‌రావు తెలిపారు. మండల మండల హౌసింగ్ కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి గృహ నిర్మాణాల పురోగతిపై ఏఈ గౌస్ మొహిద్దీన్‌తో చర్చించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ గృహ నిర్మాణాలను పూర్తి చేసుకునేందుకు ఎస్సీ, ఎస్టీలకు రూ.75వేలు, బీసీలకు రూ.50వేలు చొప్పున అదనంగా అందజేస్తోందని తెలిపారు. గృహ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి



కావలి: మాట్లాడుతున్న పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు



బిట్రగుంట: తహసీల్దార్ సురేష్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న పాస్టర్లు

కావలి/బోగోలు: పాస్టర్ ప్రవీణ్ రాజమహేంద్రవరం శివారులో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని కావలికి చెందిన పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక క్రిస్టియన్‌పేటలోని ప్రార్థన మందిరంలో బుధవారం వారు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ చైర్మన్ ఏసుబాబు, కన్వీనర్ పాడేటి థామస్ మాట్లాడుతూ పాస్టర్ పగడాల ప్రవీణ్ బుల్లెట్ బైక్‌పై రాజమహేంద్రవరం వస్తున్న క్రమంలో పథకం ప్రకారం కొందరు హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారని తాము భావిస్తున్నామన్నారు. ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి దోషులను శిక్షించి పాస్టర్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో క్రైస్తవులందరం కలిసి న్యాయం జరిగేంత వరకు పోరాడుతామన్నారు. ఈ సమావేశంలో కావలి డివిజన్ పాస్టర్ అసోసియేషన్ సెక్రటరీ ఎర్మియా ప్రభాకర్, క్రిస్టియన్ మైనార్టీ నాయకులు బోగిరి విన్సెంట్, జాయింట్ సెక్రెటరీ రతన్ ప్రసాద్,పాస్టర్లు విజయ్ కుమార్, యేసు రత్నం,శ్యామ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బోగోలు మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో పాస్టర్లు క్రైస్తవులు బోగోలు నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. తమ వినతిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఈద్గాలో పారిశుధ్య పనులు



ఆత్మకూరు: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మున్సిపల్ పరిధిలోని ఈద్గా మైదానాన్ని బుధవారం శుభ్రం చేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, ఈద్గా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జేసీబీతో ముళ్ల పొదలు, చెత్తను తొలగించి చదును చేశారు. రంజాన్ ప్రత్యేక ప్రార్థనలకు హాజరయ్యే ముస్లిం సోదరులకు తాగునీరు, చలువ పందిళ్లు, తదితర సౌకర్యాలను కల్పించనున్నట్లు వారు తెలిపారు.

ఇంటి పన్నులపై 50శాతం వడ్డీ రాయితీ

అల్లూరు: ప్రభుత్వం ఇంటి పన్నులకు సంబంధించిన వడ్డీపై 50 శాతం రాయితీని ప్రకటించిందని నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావు బుధవారం తెలిపారు. మార్చి 31వ తేదీలోగా ఒకేసారి ఏక మొత్తంలో ఇంటి పన్నులు చెల్లించే వారికి వడ్డీ రాయితీని కలిస్తున్నట్లు చెప్పారు. నగర పంచాయతీ పరిధిలోని ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పన్నులు చెల్లించి నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

విద్యార్థికి అభినందన



ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఐదోతరగతి విద్యార్థి ఇరగన వెంకటహితేష్ నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ప్రతిభకనబరిచాడు. కృష్ణాపురం నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యాసంవత్సరంలో ఆరోతరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలో సత్తాచాటి సీటు సాధించాడు. ఈ సందర్భంగా హితేష్‌ను మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాల హెచ్ఎం ఇస్మాయిల్, ఉపాధ్యాయ సిబ్బంది బుధవారం అభినందించారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

- ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అధికారులకు సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో ఎంపీపీ మూలె పద్మజవినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మండలాభివృద్ధికి తన వంతు పూర్తి సహకారాన్ని అందజేస్తానని తెలిపారు. తాగునీటి సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే అవసరమైన నిధులు కేటాయిస్తామని తెలిపారు. ఉదయగిరి–బండగానిపల్లి ఘాట్‌రోడ్డు సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. గండిపాళెం ప్రాజెక్ట్ అభివృద్ధి, కలిగిరి–సంగం మధ్యన డబుల్‌రోడ్డు నిర్మాణానికి కృషిచేస్తామన్నారు. ఉదయగిరిలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఉదయగిరిని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు తగిన కృషిచేస్తానని హామీ ఇచ్చారు. మండలాభివృద్ధికి పూర్తి సహకారాన్ని అందిస్తానన్నారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు గ్రామాల్లోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించారు. పార్టీలకతీతంగా అధికారులు గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. తొలుత జెడ్పీ, మండల పరిషత్ నిధులు రూ.60 లక్షలతో చేపట్టనున్న మండల ప్రజాపరిషత్ కార్యాలయ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సమావేశంలో వైస్‌ఎంపీపీ గుంటుపల్లి మాలకొండయ్య, మట్ల శాంతి, జెడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబుయాదవ్, సొసైటీ మాజీ అధ్యక్షుడు మూలె వినయ్‌రెడ్డి, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ కోనేటి అరుణ, టీడీపీ మండల కన్వీనరు సీహెచ్ బయ్యన్న, ఎంపీడీఓ అప్పాజీ, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు నూతన చట్టాన్ని ఎప్పుడు తెస్తారు?



వినతిపత్రం ఇస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

కావలి: ఎన్డీఏ కూటమి ఎన్నికల సమయంలో కౌలు రైతుల రక్షణ కోసం నూతన కౌలు చట్టాన్ని తీసుకొస్తామని హామీ ఇచ్చిందని, కానీ ఇంత వరకు తీసుకురాలేదని, ఎప్పుడు అమల్లోకి తీసుకొస్తారో చెప్పాలని ఏపీ కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని బుడమగుంట వార్డు సచివాలయ సిబ్బందికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు బలిజేపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునే పరిస్థితి లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫార్మర్ రిజిష్టర్‌లో కూడా కౌలు రైతులను నమోదు చేయడం లేదన్నారు. ఫార్మర్ రిజిష్టర్ లో నమోదైన రైతులకు మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు వర్తిస్తాయని చెబుతున్నారన్నారు. ఆత్మహత్యలు చేసుకున్న కౌలు రైతులకు గుర్తింపు కార్డులు లేకపోయిన పంచనామా రిపోర్టు ఆధారంగా కుటుంబ సభ్యులకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కౌలురైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20వేలు నగదు, పంట బీమా పరిహారం, ఇనుపుట్ సబ్సిడీలు అందజేయాలని కోరారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దమ్ము దర్గాబాబు, నాయకులు నారాయణ స్వామి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భూఆధార్‌పై అవగాహన



వరికుంటపాడు: అవగాహన కల్పిస్తున్న ఏఓ

వరికుంటపాడు : వ్యవసాయ భూమి కలిగిన ప్రతిరైతు తప్పకుండా రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించి ఆధార్ తరహా 11 అంకెల రైతు విశిష్ట సంఖ్యను ఈ నెలాఖరులోగా నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి రవికుమార్ సూచించారు. మండలంలోని రామాపురం గ్రామంలోని రైతులకు బుధవారం ఆయన అవగాహన కల్పించారు. ప్రభుత్వ వ్యవసాయ పథకాలు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, సబ్సిడీపై అందజేసే పరికరాలు, విత్తనాలు, తదితరాలు పొందాలంటే రైతులు తప్పనిసరిగా విశిష్ట గుర్తింపు సంఖ్య కలిగి ఉండాలన్నారు.



జలదంకి: ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేస్తున్న వీఏఏ

జలదంకి: భూమి కలిగిన ప్రతిరైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను చేయించుకోవాలని వీఏఏలు మేఘన, శివప్రియ సూచించారు. మండలంలోని జమ్మలపాళెం రైతు భరోసా కేంద్రంలో ఫార్మర్స్ రిజిస్ట్రేషన్‌పై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. అనంతరం భూములు కలిగిన రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేశారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ వ్యవసాయ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. అలాగే బ్యాంకుల ద్వారా రుణాలు పొందేందుకు అర్హులవుతారని చెప్పారు. రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే ఎటువంటి పథకాలు వర్తించవని తెలిపారు.

మందుబాబుల వీరంగంతో విద్యార్థినుల హడల్



మద్యం దుకాణం వద్ద రోడ్డుపైనే బైక్‌లను పార్క్ చేసిన దృశ్యం

కావలి: మండలంలోని కావలి–పెద్దపవని రోడ్డులో జలదంకి మండలం లింగరాజు అగ్రహారం గ్రామానికి వెళ్లే రోడ్డు వద్ద ఇటీవల నూతనంగా మద్యం షాపును ఏర్పాటు చేశారు. ఇక్కడ మందుబాబులు వీరంగం చేస్తుండడంతో ఆ మార్గంలో కొత్తపల్లి ఉన్నత పాఠశాలకు వెళ్లే జలదంకి మండల లింగరాజు అగ్రహారం గ్రామానికి చెందిన విద్యార్థినులతో పాటు కావలి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తపల్లి ఉన్నత పాఠశాలకు 1.5 కిలోమీటర్ల దూరం ఉన్న లింగరాజుఅగ్రహారం గ్రామానికి చెందిన 50 మంది విద్యార్థులు వస్తుంటారు. లింగరాజుఅగ్రహారం రోడ్డు ప్రారంభంలో ఏర్పాటు చేసిన మద్యం షాపును ఏర్పాటు చేయడంతో విద్యార్థినుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మద్యం దుకాణం వద్దకు రాగానే మందుబాబులు మద్యం మత్తులో ఖాళీ ప్లాస్టిక్ గ్లాసులు విసరడం, చిరుతిండి ఖాళీ ప్యాకెట్లు విసరరడం, మాటలతో వేధించడం చేస్తుండడంతో విద్యార్థినులు హడలిపోతున్నారు. అలాగే కొత్తపల్లి గ్రామానికి చెందిన మహిళలు పొలాల్లోకి వెళ్లే సమయంలో మందుబాబులు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. అలాగే మందుబాబులు రోడ్డుపైనే వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో పొలాల్లోకి పశువులు, గేదెలు, మేకలు తదితరాలను తోలుకెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో తరచూ మందుబాబులు వివాదాలకు సైతం దిగుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి మద్యం షాపును మరో చోటుకు మార్చాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.